సాక్షి చిత్తూరు

శనివారం । 21 । జూన్ । 2025



బండి దొరక్క బేజారు

జిల్లాలో ట్రాక్టర్ల కొరత మామిడి రైతులను తీవ్రంగా వేధిస్తోంది. బండ్లు దొరక్క.. బాడుగలు కట్టలేక అల్లాడిపోతున్నారు. - 8లో



విలీనం మాకొద్దు

కూటమి ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల విలీనం ప్రక్రియ మాకొద్దంటూ బైరెడ్డిపల్లె వాసులు డిమాండ్ చేస్తున్నారు. - 8లో



రైతుల క్షుద్బాధ తీర్చిన కలెక్టర్

కలెక్టర్ సుమిత్‌కుమార్ మామిడి రైతులకు అండగా నిలుస్తున్నారు. వారి ఆకలికేకలు తీర్చేలా చర్యలు చేపట్టారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు యోగాంధ్ర

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 5,808 ప్రాంతాల్లో యోగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం పూర్తయిన తర్వాత ఉదయం 10 గంటల్లోపే ఆ కార్యక్రమం ఫొటోలు, వీడియోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

బలవంతపు భూ సేకరణ వద్దు



సీసీఎల్ఏ జయలక్ష్మికి వినతి పత్రం ఇస్తున్న రైతులు, కార్మిక సంఘ నాయకులు

శాంతిపురం: కుప్పం ఎయిర్‌పోర్ట్ కోసం తమ భూములను బలవంతంగా లాక్కోకుండా చూడాలని కోరుతూ బాధిత రైతుల ప్రతినిధులు ఏపీ సీసీఎల్ఏని వేడుకున్నారు. శుక్రవారం విజయవాడలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ) జయలక్ష్మిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతులు జంగం చక్రపాణిరెడ్డి, లక్ష్మి, శ్రీనివాసులురెడ్డి తదితరులు కమిషనర్‌ను కలిశారు. భూములు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని మొరపెట్టుకున్నారు. తరాల నుంచి అనువంశికంగా సంక్రమించి, తమ కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న భూములను వదుకోలేమని స్పష్టం చేశారు. అన్నం పెడుతున్న సాగు భూములను కోల్పోతే తాము బతకలేమని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకునేది లేదని, దీనిపై ఉన్న అభ్యంతరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని సీసీఎల్ఏ సూచించినట్లు రైతులు తెలిపారు.

యోగాలో వెనుకబడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్షశాఖ లక్ష్యం చేరుకోవడంలో వెనుకబడింది. జిల్లాలో 2,462 ప్రభుత్వ బడులుండగా ఇందులో 1,48,189 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో యోగా చేయించి ఆ వివరాలను సమగ్రశిక్ష వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఇప్పటి వరకు జిల్లాలో 70 శాతం లక్ష్యాలను అధికారులు పూర్తి చేయలేక పోయారు. సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే యోగాంధ్ర కార్యక్రమం నిర్వహణలో విఫలయ్యారని తెలుస్తోంది.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూలైన్ ఏటీజీహెచ్ వద్దకు చేరుకుంది. గురువారం అర్ధరాత్రి వరకు 70,226 మంది స్వామి వారిని దర్శించుకోగా 31,960 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.30 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది.





చిత్తూరులోని గిరింపేట సచివాలయానికి క్యూకట్టిన ప్రజలు

తల్లికి ఎగనామం!

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT

'నీకు పదిహేను వేలు.. నీకు పదిహేను వేలు.. చిట్టి పాపా.. నీకు కూడా పదిహేను వేలు..' ఏపీలో ఈ మధ్య బాగా ప్రచారంలోకి వచ్చిన డైలాగు ఇది. ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు సైకిల్ వేసుకుని ఎన్నికలకు ముందు ఇంటింటికీ వెళ్లి మరీ మహిళలు, పిల్లలందరికీ ఈ వాగ్దానమిచ్చారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని నమ్మబలికారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన కుమారుడు లోకేష్, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా దీనిపై విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా ఎన్నికల్లో గెలిచిన మొదటి ఏడాది తల్లికి వందనం ఎగ్గొట్టారు. ఇదిచాలదన్నట్టు ఇటీవల అమలు చేసిన ఈ పథకాన్ని తూతూమంత్రంగా అందించి చేతులు దులుపుకున్నారు. తల్లికి వందనం అందక చాలా మంది అర్హులు నానాఅగచాట్లు పడుతున్నారు. సచివాలయాలు, కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. తల్లికి వందనం ఎగనామంపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్..



సచివాలయం వద్ద ముగ్గురు పిల్లలతో తల్లి మణిమేఘల

- ఈ చిత్రంలోని మహిళ పేరు మణిమేఘల. చిత్తూరు ఇరువారంలోని దళితవాడలో నివాసముంటున్నారు. ఆమె భర్త సురేష్‌కుమార్‌తో పాటు కూలి పనులకు వెళ్లేది. 12 రోజుల క్రితం ఆమె భర్త గుండెపోటుతో మరణించారు. మణిమేఘల ముగ్గురు పిల్లలతో బాడుగ ఇంట్లో ఉంటున్నారు. మొదటి కుమార్తె ప్రియదర్శిని 9వ తరగతి, రెండో కుమార్తె ప్రియాంక 7, అబ్బాయి ప్రేమ్ 5వ తరగతి చదువుతున్నారు. ఈ కుటుంబంలో తల్లికి వందనం ఇంతవరకు ఒక్క బిడ్డకు కూడా పడలేదు. ఆ డబ్బులు వస్తే పిల్లల చదువుకు సాయంగా ఉంటుందని ఆమె ఆశ పడినా ఫలితం లేకపోయింది. అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమకేమీ తెలియదని వారు చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది.

- పలువురికి తల్లికి వందనం తిరస్కరణ
- అర్హులైనా జమచేయని నగదు
- పెండింగ్ బాకీలకు జమచేసుకుంటున్న బ్యాంకర్లు
- తల్లడిల్లుతున్న తల్లులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న కూటమి నేతలు, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఏరుదాటాక తెప్పతగలేయడం సీఎం చంద్రబాబుకు కొత్తేమీ కాదు. అధికారం కోసం అడ్డదిడ్డంగా హామీలు గుప్పించడం.. తీరా అధికారం చేపట్టాక వాటిని విస్మరించడం ఆయనకు వెన్నతోపెట్టిన విద్య. ఇప్పుడు కూడా అలాంటిదే చోటు చేసుకుంది. గత ఎన్నికలకు ముందు తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున అందిస్తామని వాగ్దానమిచ్చారు. తీరా అధికారాన్ని చేపట్టిన తర్వాత ఈ పథకాన్ని నీరుగార్చుతూ తూతూమంత్రంగా అందించి చేతులు పైకెత్తేశారు.

అంతా గందరగోళం

ఏ పథకానికైనా దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి లబ్ధిదారులను గుర్తించడం పరిపాటి. కానీ కూటమి ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించకుండానే లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసింది. ఈ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించింది. గత విద్యాసంవత్సరం డేటా ఆధారంగా జాబితాను సిద్ధం చేయడం వల్ల, ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు పథకం వర్తించకుండా పోయింది.

కూటమి కుట్రలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే, మ్యాపింగ్ చేపట్టినప్పుడు, అద్దెకున్న వారి ఆధార్ కార్డును ఇంటి ఆస్తి పన్నుతో లింక్ చేయడం వల్లే ఈ సమస్య తలెత్తిందని తెలుస్తోంది. దీంతో లబ్ధిదారుల ఆధార్ నంబర్ పరిశీలిస్తే, ఆస్తి ఉన్నట్లు చూపిస్తోంది. ఈ లింకును తొలగించడానికి సచివాలయ సిబ్బంది నిరాకరించడం, ఉన్నతాధికారులు సైతం దీనిపై దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

22,963 మందికి ఎగనామం

జిల్లాలో విద్యార్థుల సంఖ్య -	2,60,641
గత ప్రభుత్వంలో అమ్మఒడి అర్హులు -	1,53,345
కూటమిలో తల్లికి వందనానికి అర్హులు -	1,30,382
తల్లికి వందనం అందని వారు -	22,963

జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	2,113	83,874
ప్రాథమికోన్నత	237	21,950
ఉన్నత	312	62,231
హైస్కూల్ ప్లస్	25	10,155
ప్రాథమిక, ఉన్నత	174	40,288
ప్రాథమిక, హైస్కూల్ ప్లస్	27	14,815
జూనియర్ కళాశాలలు	96	27,328
మొత్తం	2,984	2,60,641

జగనన్న ప్రభుత్వంలో అమ్మఒడి లబ్ధిదారులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
చిత్తూరు	17,045
గంగాధరనెల్లూరు	20,306
కుప్పం	26,148
నగరి	11,685
పలమనేరు	31,721
పుంగనూరు	25,590
పూతలపట్టు	20,850
మొత్తం	1,53,345

మొండి బకాయిలకు జమ

జిల్లా వ్యాప్తంగా తల్లికి వందనం నగదు తల్లుల ఖాతాల్లో జమ అయిన విషయం విధితమే. ఈ నగదును తీసుకుందామని తల్లులు బ్యాంకుల వద్ద బారులు తీరారు. తీరా ఆ నగదు తీసుకునే సమయంలో బ్యాంకర్లు బకాయిల్లో జమ చేస్తున్నామని చెప్పడంతో లబ్ధిదారులు నిట్టూర్చుతూ ఇంటిబాట పట్టారు. గత ప్రభుత్వంలో ఏ సంక్షేమ పథకం అయినా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయితే ఆ నగదును బకాయిలకు జమ చేసేందుకు వీలు లేకుండా ఆదేశాలిచ్చింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అటువంటి ఆదేశాలు ఇవ్వలేదు.

తల్లికి వందనానికి ఇన్ని ఆంక్షలా బాబు?



- ఒకే ఇంట్లో ఫీజురీయింబర్స్‌మెంట్ పొందితే ఆ ఇంట్లో ఇతరులకు తల్లికి వందనం వర్తించదు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే ఉపకార వేతనాలు పొందే వారికి ఈ పథకం మంజూరు కాలేదు.
- బియ్యంకార్డు లేని వారికి, కుటుంబం నెలవారీ ఆదాయం గ్రామీణులకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించినవారికి కట్ చేశారు.
- మాగాణి మూడెకరాలు, మెట్ట 10 ఎకరాలు మించి ఉండకూడదు.
- పట్టణాల్లో వెయ్యి చ.అ స్థలం ఉన్నా, నాలుగు చక్రాల సొంత వాహనం ఉన్నవారికి పథకం పొందకుండా చేశారు.
- ప్రతి కుటుంబానికీ ఏడాది విద్యుత్ వినియోగాన్ని పరిగణలోకి తీసుకొని నెలకు 300 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగించి ఉంటే పథకం పొందేందుకు వీలు లేకుండా చేశారు.
- చిరు ఉద్యోగులు, పింఛన్ పొందుతున్న వారికి ఈ పథకాన్ని తొలగించారు.

బ్యాంకర్ల మాయాజాలం



నా ఖాతాలో రూ.8,800 మాత్రమే జమ చేశారు. కూటమి ప్రభుత్వమేమో గొప్పగా ప్రచారం చేస్తోంది. ఇలా ఎందుకు పడిందని సచివాలయం సార్ వాళ్లను అడిగాను. మేమేం చేసేది అని చెప్పారు. బ్యాంకర్లే ఏదో మాయాజాలం చేస్తున్నారు. పాత బకాయిలకు జమచేసుకోవడం ఎంతవరకు కరెక్ట్. దీనిపై ప్రభుత్వం స్పందించాలి.

– రేఖ, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం మండలం.


తల్లికి వందనం పడలేదు



నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఒక్కరికి కూడా తల్లికి వందనం నగదు పడలేదు. గతంలో అమ్మ ఒడి నగదు వచ్చేది. సచివాలయం వద్దకు వెళ్లి అడిగితే పడుతుంది అంటున్నారు. స్పష్టంగా సమాధానం చెప్పడం లేదు. నేను టైలర్ పని చేస్తుంటాను. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఇస్తామన్నారు. ఇప్పుడేమో ఒక్కరికి కూడా నగదు జమకాలేదు.

– షబానా, యాదమరి.

భారంగా ఉంది



నాకు ఇద్దరు పిల్లలు. ప్రైవేట్ స్కూల్‌లో చదువుతున్నారు. గత ఏడాది కంటే ఈ సారి ఫీజు కూడా పెరిగిపోయింది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. కుటుంబ పోషణ అంతంత మాత్రంగానే ఉంది. పిల్లల చదువు కోసం అప్పు చేయాల్సి వస్తోంది. గతంలో అమ్మ ఒడి డబ్బులైనా వచ్చేవి. నేడు తల్లికి వందనం అన్నారు. అది కూడా రాలేదు.

– నాగరాజు, విజయపురం

మోసం చేశారు



నాకు ఇద్దరు పిల్లలున్నారు. ఇద్దరికీ కలిపి రూ.26 వేలు రావాల్సి ఉన్నా రూ.21 వేలు మాత్రం జమ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో రూ.26 వేలు జమ చేసినట్లు చూపించారు. గతంలో అమ్మఒడి ఇచ్చేటప్పుడు బ్యాంకర్లు ఎలాంటి బకాయిలు పట్టుకునే వారు కాదు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బ్యాంకర్లు జమచేసుకుంటున్నారు.

– హేమావతి, పెద్దతయ్యూరు, శ్రీరంగరాజపురం మండలం

రోడ్డున పడ్డ మామిడి!

- టన్నుల కొద్దీ రోడ్డుపైనే
- అయోమయంలో అన్నదాతలు

కాణిపాకం: మామిడి రోడ్డున పడింది. టన్నుల కొద్దీ తోతాపురి రోడ్డుకే అంకితమవుతోంది. ఫ్యాక్టరీలో అన్‌లోడింగ్ కష్టాలు రైతులను ముప్పతిప్పలు పెడుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 90శాతం కాయలు పక్వానికి వచ్చేశాయి. ఇకపై కోతలు ఇబ్బుముబ్బడిగా ప్రారంభం కానున్నాయి. ఫ్యాక్టరీలు గుజ్జు తయారీ విషయంలో తప్పుడు లెక్కలు చూపించేందుకు సన్నద్ధమవుతున్నాయి. దీనికితోడు విదేశాల్లో యుద్ధాలు ఫ్యాక్టరీలను భయపెడుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 56 హెక్టార్ల మేర మామిడి పంట సాగవుతోంది. తద్వారా 6.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రావొచ్చని అధికారుల అంచనా. ఇందులో టేబుల్ రకాలు 16,105 హెక్టార్లకు గాను 1,45,960 మెట్రిక్ టన్నులు, తోతాపురి 39,895 హెక్టార్లకు 4.9 లక్షల మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని అధికారులు ముందస్తుగా అంచనా వేశారు. వారి అంచనాలకు తగ్గట్టు ఈసారి పంట దిగుబడి వచ్చింది. అయితే పండిన పంటను అమ్ముకోవడానికి రైతులు విలవిల్లాడిపోతున్నారు.

గత ఏడాది నిల్వలతో..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 పళ్లగుజ్జు పరిశ్రమలున్నాయి. చిత్తూరు జిల్లాలో మాత్రం 35 ఫ్యాక్టరీలున్నాయి. వీటిలో 12 ఫ్యాక్టరీలు మామిడి గుజ్జు తయారీకి దూరమయ్యాయి. ఇందులో కొన్ని టమాటా వంటి వాటిని గుజ్జు చేసి అమ్ముకుంటున్నాయి. గత ఏడాది యూరఫ్ దేశాల్లో జరిగిన యుద్ధాల ప్రభావం వల్ల ఫిబ్రవరి వరకు 2.5 లక్షలక్ష టన్నుల గుజ్జు నిల్వలు పేరుకుపోయాయి. ఆ తర్వాత కొద్దికొద్దిగా అమ్ముడుపోయాయి. ప్రస్తుతం 80 వేల టన్నుల వరకు నిల్వలు ఉన్నట్లు సమాచారం. ఈ భయంతో ఫ్యాక్టరీలు మామిడిపై చిన్న చూపుచూస్తున్నాయి. ఈ ఏడాది అధికారులు బలవంతం చేయడంతో 23 ఫ్యాక్టరీలు తోతాపురి కాయలు కొనుగోలు చేస్తున్నాయి.



గంగాధరనెల్లూరు మండలం, ఎట్టేరి వద్ద రోడ్డుపై క్యూ కట్టిన ట్రాక్టర్లు

గుజ్జు తయారీ ఎక్కువ.. లెక్కలు తక్కువ

ఉమ్మడి జిల్లాలోని 43 ఫ్యాక్టరీలో 90 లైన్ (మామిడిగుజ్జు తయారీకి అవసరమైన యంత్రపరికరాలు)లు ఉన్నాయి. చిత్తూరులో జిల్లా విషయానికి వస్తే 35 పళ్లగుజ్జు పరిశ్రమలుంటే అందులో 60 లైన్‌లు ఉన్నాయి. వీటిలో 23 ఫ్యాక్టరీలకు గాను 54 లైన్లు పనిచేస్తున్నాయి. ఒక లైన్‌లో రోజుకూ 10 టన్నుల కాయల వరకు గుజ్జు తయారీ చేయొచ్చు. కానీ లైన్ క్లీనింగ్ కారణంగా 6 నుంచి 8 టన్నుల కాయల వరకు గుజ్జు చేస్తున్నాయి. ఇలా రోజువారీగా ఒక్కో ఫ్యాక్టరీ 200 నుంచి 250 టన్నుల కాయలను గుజ్జు తయారీ చేస్తున్నాయి. ఈ లెక్కన్న మొత్తం ఫ్యాక్టరీలు 10 వేల నుంచి 11వేల టన్నుల కాయల వరకు గుజ్జు తయారీకి వాడుతున్నాయి. తద్వారా గుజ్జు రూపంలో 5 నుంచి 6 టన్నులకు ప్యాకింగ్ అవుతున్నాయి. అయితే అధికారులు వద్ద ఉన్న లెక్కలకు, ఫ్యాక్టరీ నిర్వాహకులు చెప్పే లెక్కలకు పొంతన ఉండడం లేదు. తమిళనాడు నుంచి వస్తున్న కాయలకు ఫ్యాక్టరీలు ఈ లెక్కల్లోకి ఎక్కిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నిల్వలు, గుజ్జు తయారీని అధికంగా చూపించి తోతాపురి కొనుగోలును నిలుపుదల చేయాలని ఫ్యాక్టరీ నిర్వాహకులు సిద్ధమైనట్లు రైతులు చెబుతున్నారు.

యుద్ధాలతో మళ్లీ వణుకు

జిల్లాలో తయారైన పళ్లగుజ్జును గల్ఫ్, యూరఫ్ దేశాలకు అధికంగా ఎగుమతి చేస్తారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధాలు, ఉక్రెన్-రష్యా యుద్ధాలు పళ్లగుజ్జు పరిశ్రమదారులను గడగడలాడిస్తున్నాయి. ఈ భయంతో మధ్యలో కూడా తోతాపురి గుజ్జును నిలుపుదల చేసే అవకాశాలున్నాయని పరిశ్రమదారుల చెబుతున్నారు. ఇలాంటి తరుణంలో తోతాపురి అమ్మకాలు మూగబోయే అవకాశాలున్నాయి. తద్వారా 60శాతం పంట తోటలకు పరిమితం కానున్నట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

41,005 టన్నులు మాత్రమే ఫ్యాక్టరీకి

ఈ నెల 6వ తేదీ నుంచి కాయలు కొనుగోలు చేయగా.. అధికారుల వద్ద 8వ తేదీ నుంచి కాయలు కొనుగోలు వివరాలున్నాయి. ఫ్యాక్టరీ నిర్వాహకులు 12 వేలకు పైగా టోకన్లు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే 5,993 మంది రైతులు 41,005 టన్నుల కాయలు ఫ్యాక్టరీలకు చేరినట్లు వారి వద్ద గణాంకాలున్నాయి. రోడ్డుపైనే గత మూడు రోజులుగా 80 వేల టన్నుల వరకు ట్రాక్టర్లల్లోనే మూలుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. జీడీ నెల్లూరు మండలం ఎట్టేరిలోని ఫ్యాక్టరీ వద్ద 800 ట్రాక్టర్లు బారులు తీరగా.. 4వేల టన్నుల కాయలు ఫ్యాక్టరీలోకి వెళ్లేందుకు వేచి చూస్తున్నాయి. గుడిపాలలోని పానటూరు వద్ద ఉన్న మ్యాంగో ఫ్యాక్టరీ వద్ద 650పైగా ట్రాక్టర్లు, లారీలు క్యూకట్టాయి. ఇందులో 3,800 టన్నుల మేర ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అలాగే గుడిపాల మండలంలోని కొత్తపల్లి సమీపంలోని ఫ్యాక్టరీ వద్ద 850 ట్రాక్టర్లు, లారీల్లో 5 వేల టన్నుల కాయలు రోడ్డుపైనే కాపలాకాస్తున్నాయి. మరిన్ని ఫ్యాక్టరీల వద్ద కూడా ఇదే పరిస్థితి ఎదురవుతోంది.



చెడిపోయిన మామిడిని ఏరివేస్తున్న కూలీలు

మూడు రోజులుగా ఇక్కడే ఉన్నాం



కాయలు తెచ్చి మూడు రోజులు అవుతా ఉండాది. ఈ మూడు రోజులు తిండీలేదు.. ఏమీలేదు. తిండి లేకపోయిన పర్వాలేదు. కాయలు దింపుకుంటే చాలు. కానీ ఇంత వరకు దింపుకోలేదు. ఈడ నుంచి ఆడ వరకు 800ట్రాక్టర్లు బారులు తీరాయి. ఇంకో రోజు ఉంటే బండిలో ఉండే కాయలు దేనికీ పనికి రావు. ఈసారి నిండా మునిగిపోయాం. మమల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి స్వామీ. – సుందరయ్య, చిత్తూరు మండలం

దమ్మిడీకి పనికిరావ్



మూడు రోజులు, నాలుగు రోజులు ట్రాక్టర్లోనే కాయలుంటే ఎందుకూ పనికిరావు. ఫ్యాక్టరీకి పనికి రావు. రోడ్డు మీద పారేసి రావాల్సిందే. ఫ్యాక్టరీ వద్ద అవస్థలు పడుతున్నాం. బండికి రాత్రంతా కాపాల కాస్తున్నాం. ఇలా అయితే రైతులు ఏమైపోవాలి. ఫ్యాక్టరీ వాళ్ల మాత్రం వాళ్ల సమస్యలను చెప్పుకుంటున్నారు. మరో పక్క యుద్ధాలు అని చెబుతున్నారు. దాని వల్ల మాకు నష్టమే అంటున్నారు. – కిరణ్‌కుమార్, పెనుమూరు

సమగ్ర విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఇటీవల టీచర్ల బదిలీల ప్రక్రియ నిర్వహించిన విషయం విధితమే. అయితే ఈ బదిలీల్లో పలువురు టీచర్లు (టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, టిస్) లో తప్పుడు సమాచారమిచ్చి బదిలీల్లో తప్పుడు పాయింట్లు పొందిన వారిపై జిల్లా విద్యాశాఖ నిఘా పెట్టింది. తప్పుడు పాయింట్లు పొంది బదిలీల్లో ప్రయోజనం పొందిన టీచర్లు ఇప్పటి వరకు 135 మంది ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. వారిపై వచ్చిన అభియోగాలను ప్రత్యేక అధికారులతో విచారణ చేయిస్తున్నారు. ఈ విచారణ పూర్తయిన తర్వాత తప్పుడు పాయింట్లు పొందినట్లు తేలితే శాఖాపరంగా సంబంధిత టీచర్ల పై వేటు వేసేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.

క్లుప్తంగా

సిఫారసులు అనుమతించొద్దు



రైతులతో ముఖాముఖి నిర్వహిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

కార్వేటినగరం: మామిడి కాయల రవాణాలో ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా చూడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని అన్నూరు వద్ద ఉన్న ఏబీసీ జ్యూస్ కర్మాగారాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. మామిడి రవాణాలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాయలను దిగుమతి చేసుకోవాలని, మామిడి కొనుగోళ్లలో సిఫార్సులకు తావు లేకుండా చూడాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, సీఐ హనుమంతప్ప, వ్యవసాయశాఖ అధికారిణి హేమలత, ఏబీసీ జ్యూస్ పరిశ్రమ మేనేజర్ వెంకటేశ్వర్లు, నాగేశ్వరరాజు, యుగంధర్ ఉన్నారు.

రిక్వెస్ట్, మ్యూచువల్‌కే అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సమగ్రశిక్ష శాఖ పరిధిలో నిర్వహిస్తున్న బదిలీల్లో రిక్వెస్ట్, మ్యూచువల్‌కు మాత్రమే అవకాశం ఉన్నట్లు జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా సమగ్రశిక్ష శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని కేజీబీవీల్లోని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, మండల స్థాయిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ, పీటీ, సీఆర్‌ఎంటీలు, అకౌంటెంట్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, మెసెంజర్‌లు, ఆఫీస్ సబార్డినేట్లు, సైట్ ఇంజినీర్లకు బదిలీలు నిర్వహిస్తామన్నారు. బదిలీలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 21న చివరి తేదీ అని తెలిపారు. అభ్యర్థుల స్టేషన్ సీనియారిటీ, స్పెషల్ సర్వీస్, సీనియారిటీ పాయింట్లను ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లాలనుకునేవారు దరఖాస్తులను రాష్ట్ర కార్యాలయానికి పంపించాల్సి ఉంటుందని ఏపీసీ వెల్లడించారు.

బండి దొరక్క బేజారు!

- జిల్లాలో ట్రాక్టర్లకు భలే డిమాండ్
- మామిడికాయల ఎఫెక్ట్‌తో ట్రాక్టర్ల కొరత
- మామిడి కాయల తరలింపునకు రాని లారీలు



పళ్ల గుజ్జు పరిశ్రమ ఎదుట క్యూలో వేచి ఉన్న ట్రాక్టర్లు

కాణిపాకం: మామిడి రైతులు ఆలస్యంగా వచ్చిన పూతతో పులకరించిపోయారు. కాయలొచ్చాక మీసం తిప్పారు. కోత కొచ్చాక కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్నారు. కాయలు అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. టోకన్ల కోసం తొక్కిసలాట, తోపులాటలో నలిగిపోయారు. టోకన్లు చేతికొచ్చాక కోత కోసి తీసుకెళితే ఫ్యాక్టరీ వద్ద పడిగావులు కాస్తున్నాయి. ట్రాక్టర్ చార్జీలు, వెయిటింగ్ చార్జీలు, డ్రైవర్ కూలీలు పట్టిపీడిస్తున్నాయి. దీనికి తోడు లారీలు మామిడి కాయల తరలింపునకు పంపలేమంటూ ఓనర్లు మొండికేస్తున్నారు. దీంతో ట్రాక్టర్లకు డిమాండ్ పెరిగింది.

నిరీక్షిస్తూ.. నీరసిస్తూ!

జిల్లాలో ఈ నెల 8వ తేదీ నుంచి వేగంగా మామిడి కోతలు ప్రారంభయ్యాయి. అష్టకష్టాలు పడి టోకన్లు సంపాదించిన రైతులు వారికి ఇచ్చిన తేదీ ప్రకారం కాయలు కోసి ట్రాక్టర్లలో ఫ్యాక్టరీలకు తీసుకెళుతున్నారు. అయితే అక్కడ రైతులు అనుభవిస్తున్న కష్టాలు అన్నీఇన్నీకావు. కాయలు అన్‌లోడింగ్‌కు ముప్పుతిప్పలు పడుతున్నారు. ఫ్యాక్టరీల్లో సిఫార్సులకు ప్రాధాన్యత ఇవ్వడంతో సామాన్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒక్కో ఫ్యాక్టరీ వద్ద 200 నుంచి 800 ట్రాక్టర్లు నిరీక్షిస్తున్నాయి.

ఒక్కలోడయ్యా..రావయ్యా!

ట్రాక్టర్లన్నీ కూడా ఫ్యాక్టరీల వద్దే నిలబడిపోయాయి. రోజులు తరబడి అక్కడే ఉండిపోతున్నాయి. ముందుకు..వెనక్కు వెళ్లడం తప్ప ఫ్యాక్టరీలో కాయలు దింపాలంటే ఐదు రోజుల సమయం పడుతోంది. ట్రాక్టర్ యజమానులకు వారి..వారి గిరాకీలే సరిపోతున్నాయి. కొంతమంది సొంత పంటను తరలించుకునేందుకు పరిమితం చేశారు. మిగిలిన ట్రాక్టర్లు బాడుగలకు పంపుతున్నారు. ఈ బండ్లు చాలక రైతులు అల్లాడి పోతున్నారు. ఫ్యాక్టరీలో లోడ్ దింపిన బండ్లు అట్టే బుక్ అవుతున్నాయి. చాలా మంది రైతులు టోకన్లు ఉన్నా ట్రాక్టర్లు దొరకక కోతలు కోయలేకపోతున్నారు. ఒక్క లోడే రండి అని బతిమిలాడుకున్నా ట్రాక్టర్ల యజమానులు ఖాతరు చేయడం లేదు.

తడిసిమోపుడవుతున్న ట్రాక్టర్ బాడుగలు

ఈసారి మామిడి రైతులకు దిగుబడి బాగున్నా... అందుకు తగ్గ ప్రతిఫలం లేదు. ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి చేతికి రాకపోగా..చేతిలోని పైసలు ఖాళీ అవుతున్నాయి. కోత కూలీలు రైతులకు చెమటలు పట్టిస్తున్నాయి. దీనికితోడు ట్రాక్టర్ బాడుగలు భారమయ్యాయి. కి.మీను బట్టి రూ.1000 నుంచి రూ.2000 వరకు ట్రాక్టర్ బాడుగలు అడుగుతున్నారు. మళ్లీ వెయిటింగ్ చార్జీ రోజుకు రూ.500 నుంచి రూ.1000 ఫిక్స్ చేస్తున్నారు. డ్రైవర్ కూలీ రూ.500, కొంత మంది డ్రైవర్లకు రాత్రి అయితే లిక్కర్ బాటిల్ కూడా ఇవ్వాల్సి ఉంది.

లారీలు రావు

మామిడి తరలింపునకు లారీలు రానంటూ మొండికేస్తున్నాయి. జిల్లా రవాణా శాఖ అధికారులు లారీ యజమానులతో మాట్లాడినా ఫలితం లేకపోతోంది. కాయలకు వెళితే లారీలకు గిట్టుబాటు కాదని సమాచారం. అలాగే తమిళనాడు లారీలను కూడా జిల్లాలోకి అనుమతించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రాక్టర్లను సమకూర్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ట్రాక్టర్ దొరకడం లేదు



ట్రాక్టర్ కోసం రెండు రోజులుగా తిరుగుతున్నా. ట్రాక్టర్లు దొరకడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. నేను శనివారానికి ఫ్యాక్టరీకి తోలేలా టోకన్ ఇచ్చారు. ఇప్పుడు టోకన్ ఉంది కానీ ట్రాక్టర్ దొరకడం లేదు. కోతకోయాలా వద్దా అని ఆలోచిస్తున్నాను.

– బాలాజీ, అనుపల్లి, చిత్తూరు

రైతుల క్షుద్బాధ తీర్చిన కలెక్టర్

గంగాధరనెల్లూరు: మామిడి రైతుల ఆకలి బాధను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తీర్చారు. జీడీ నెల్లూరు మామిడి పరిశ్రమను పలుమార్లు ఆయన నేరుగా పరిశీలించారు. శుక్రవారం నుంచి మామిడి రైతులకు, ట్రాక్టర్ల డ్రైవర్లకు ఫ్యాక్టరీల వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఉదయం, మధ్యాహ్నం భోజనం, తాగునీటి సదుపాయం కల్పించారు. గత వారం రోజులుగా ఫ్యాక్టరీ వద్ద మామిడి రైతులు, ట్రాక్టర్ల డ్రైవర్ల అవస్థలు, ఆకలి బాధలపై సాక్షి దినపత్రిక సీరియల్‌గా కథనాలు వెలుగులోకి తెచ్చింది. ఈ విషయంగా కలెక్టర్ స్పందించారు. గత రెండు రోజులుగా అధికారులతో కలిసి రైతులు, ఫ్యాక్టరీ నిర్వాహకులతో సమీక్షించారు. తహసీల్దార్, ఎంపీడీఓలు, జైన్ ఫ్యాక్టరీ 1, 2కు వేర్వేరుగా అప్పగిస్తూ మామిడి సీజన్ పూర్తయ్యే వరకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పర్యవేక్షణలో యూనిట్-1 వద్ద తహసీల్దార్ తులసీరామ్, యూనిట్-2 వద్ద ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు భోజన సదుపాయ ఏర్పాట్లు చేపట్టారు. కలెక్టర్, అధికారుల బృందం పలుమార్లు పరిశ్రమ వద్ద రైతులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

తప్పిపోయి.. మేడపై నిద్రించిన బాలిక

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని చర్చి వీధిలో గురువారం రాత్రి తప్పిపోయిన తొమ్మిదేళ్ల బాలిక భార్గవి ఆచూకీని ఎట్టకేలకు పోలీసులు కనుగొన్నారు. తల్లి చర్చి వీధిలో పుట్టగొడుగులు విక్రయిస్తుండగా, బాలిక తప్పిపోయింది. అర్ధరాత్రి వరకు గాలింపు చేపట్టిన పోలీసులు పలుచోట్ల సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించారు. బాలిక ఏడుస్తూ ఓ భవనం మెట్లెక్కి మేడపైకి వెళ్లినట్లు ఫుటేజీలో కనిపించింది. ఆపై వన్‌టౌన్ సీఐ మహేశ్వర సంబంధిత భవన యజమానిని పిలిపించి, తనిఖీ చేయగా.. బాల్కనీలో భార్గవి నిద్రిస్తూ కనిపించింది. బాలికను సురక్షితంగా ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

నవోదయ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



నవోదయ ఫలితాల్లో ప్రతిభ చాటిన విశ్వం విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025–26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన 2వ జాబితా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అర్హత సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.హృతిక్ రాయల్, సలాడీ భువనేష్, ఎం.నిహాంత్ కుమార్, డి.మహిదర్‌తో పాటు మొత్తం 54 మంది విద్యార్థులు నవోదయ విద్యాలయాల్లో సీట్లు సాధించారని తెలిపారు. గత 35 ఏళ్లగా జాతీయ స్థాయిలో నిర్వహించే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ తదితర పోటీ పరీక్షలకు ఉత్తమ ప్రమాణాలతో కూడిన అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. దీంతో తమ విద్యార్థులు ఆయా విద్యాసంస్థల్లో ప్రవేశం సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఆ విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్ అభినందించారు. వచ్చే ఏడాదికి నిర్వహించే పోటీ పరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

విలీనం మాకు వద్దు



పలమనేరు-కుప్పం జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న మిట్టపల్లె గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: 'విలీనం మాకొద్దు. మా గ్రామంలోనే పాఠశాలను పునరుద్ధరించాలి. ఇతర గ్రామాలకు మా విద్యార్థులను పంపించేది లేదు' అని బైరెడ్డిపల్లె సచివాలయ పరిధిలోని మిట్టపల్లె గ్రామస్తులు తేల్చిచెప్పారు. ఈ మేరకు శుక్రవారం పలమనేరు-కుప్పం జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ తమ గ్రామంలో 36 మంది విద్యార్థులు ఉన్నారని, అందులో 3, 4, 5 తరగతుల విద్యార్థులను పక్క గ్రామమైన నాగిరెడ్డిపల్లె పాఠశాలలో విలీనం చేశారని చెప్పారు. పక్క గ్రామానికి వెళ్లే టప్పుడు వ్యవసాయ పొలాల వద్ద తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉన్నతాదికారులు స్పందించి తమ గ్రామంలోనే పాఠశాలను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న బైరెడ్డిపల్లె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థుల తల్లితండ్రులతో సంప్రదించారు. సుమారు అర్ధగంట పాటు ధర్నా చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కుక్కలతో తీవ్ర ఇబ్బందులు

మండలంలోని ఆకులకొత్తూరు గ్రామంలో ఉన్న పాఠశాల విద్యార్థులను చలగానిపల్లెలో విలీనం చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని తల్లిదండ్రులు ఎంఈఓ సుబ్రమణ్యంకు ఫిర్యాదు చేశారు. గురువారం విద్యార్థులు పాఠశాల నుంచి తమ గ్రామానికి వస్తుండగా కుక్కల బెడదతో భయాందోళనకు గురయ్యారని వాపోయారు. పిల్లల భవిషత్తును దృష్టిలో పెట్టుకొని విలీనం ఆపాలని కోరారు.

ప్రతిశాఖలోనూ మహిళా కమిటీలు

– రెండో రోజు కలెక్టరేట్‌లో మహిళా కమిషన్ సమీక్ష



మాట్లాడుతున్న జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్

తిరుపతి అర్బన్ : ప్రతి శాఖలోనూ అంతర్గత మహిళా కమిటీలను ఏర్పాటు చేయాలని జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు అర్చన మంజుదార్ ఆదేశించారు. రెండో రోజు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి అధికారులతో సమీక్షించారు. ప్రాథమిక దశలోనే శాఖల సమన్వయంతో పనిచేస్తే మహిళా సమస్యలకు సులభంగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరుగుతున్న నేరాలను నిరోధించాలంటే ప్రభుత్వ ప్రైవేటు సెక్టార్లుకు సంబంధించిన యాక్ట్‌ను పటిష్టం చేయాలన్నారు. మహిళలకు సంబంధించిన ప్రతి సమస్యకు జాతీయ మహిళా కమిషన్ స్పందిస్తుందని తెలిపారు. మహిళలపై నేరాలు ఎక్కువ కావడానికి కారణం సరైన అవగాహన లేకపోవడం, భద్రత కలిగించకపోవడం ప్రధాన కారణమని తెలిపారు. మరోవైపు రాష్ట్రాలలో బాల్య వివాహాలు జరగడంతో యుక్త వయసులోనే గర్భం దాల్చడం వంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయని, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేసి అరికట్టే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. జాతీయ మహిళా కమిషన్ సూచనలు క్రమం తప్పకుండా పాటించి లైన్ డిపార్ట్‌మెంట్ సహకారంతో జిల్లాలో మహిళల పై జరుగుతున్న నేరాలను అరికట్టే దిశగా కృషి చేస్తామని తెలిపారు. మహిళల్లో ఆర్థిక సాధికారత సాధించినప్పుడు వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. జిల్లాలో బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయం నుంచి ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీస్ అందుబాటులో ఉంటారని తెలిపారు. వీరందరూ కూడా మహిళలపై జరుగుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ.. జాతీయ మహిళా కమిషన్ సూచనల మేరకు జిల్లాలోని మహిళలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ మెంబర్ రోఖాయా బేగం, మహిళా పోలీస్ డీఎస్పీ శ్రీలత, కృష్ణకుమారి జాయింట్ డైరెక్టర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి వసంత భాయి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య



మృతిచెందిన హేమాద్రి(ఫైల్)

నింద్ర: అప్పుల బాధతో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలో విషాదాన్ని మిగిల్చింది. వివరాలు.. మండలంలోని శ్రీరామపురం పంచాయతీ శ్రీరామాపురం గ్రామానికి చెందిన యవరైతు హేమాద్రి(29) భార్య దీప, కుమారుడు ఉన్నాడు. తనకున్న పొలంతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. వ్యవసాయంలో నష్టాలు రావడంతో కొంత వరకు బ్యాంక్‌లోను, ఇతరుల వద్ద అప్పు చేశాడు. ఇలా సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు భరించలేక బుధవారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం హేమాద్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐసర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా కోహ్లీ



ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ

ఏర్పేడు : మండలంలోని జంగాలపల్లి సమీపంలో ఉన్న తిరుపతి ఐసర్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఇంద్రప్రీత్‌సింగ్ కోహ్లీ నియమితులయ్యారు. విద్యామంత్రిత్వ శాఖ పరిధిలోని ఐసర్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఆయనను ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఐసర్ పాలనా చట్రాన్ని, సంస్థాగత నైపుణ్యాన్ని మరింత బలోపేతం చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

బైక్‌పై నుంచి జారిపడి మహిళ మృతి

చౌడేపల్లి: బైక్‌పై నుంచి జారిపడి మహిళ మృతిచెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం... చారాల పంచాయతీ, జంగాలపల్లెకు చెందిన రాజమ్మ(65) చౌడేపల్లెకు వచ్చింది. ఆమె సమీప బంధువైన శ్రీరాములుతో కలిసి బైక్ పై స్వగ్రామానికి వెళ్తుండగా పలమనేరు మార్గంలోని చిట్రెడ్డిపల్లె సమీపంలోని డౌన్‌లో కుక్క ఎదురుగా రావడంతో బైక్ అదుపుతప్పింది. ఈ క్రమంలో బైక్‌పై నుంచి రాజమ్మ జారిపడింది. వెంటనే ఆమెను మదనపల్లెలోని ఓ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

తుమ్మింద జాతరలో గొడవ

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు మండలం, తుమ్మింద గంగజాతరలో గొడవ చోటుచేసుకుంది. వీరప్పన్-బీఆర్ అంబేడ్కర్ పాట కోసం రెండు వర్గాలు పోటీపడ్డాయి. ఈ విషయంలో టీడీపీ ఓ మండల నేత కల్పించుకోవడంతో రెండు వర్గాలు ఆనేతపై ఆగ్రహానికి గురయ్యాయి. ఈ గొడవలకంతా ఆ నేతే కారణమంటూ రెండు వర్గాలు చివాట్లు పెట్టాయి. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. అక్కడి నుంచి ఓ వర్గం తప్పుకుంది. మరో వర్గం పోలీసులపై దురుసుగా ప్రవర్తించింది. దీంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు.

పుత్తూరు సిద్ధార్థలో గ్రాడ్యుయేషన్ డే



యువ ఇంజినీర్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

నారాయణవనం: పుత్తూరు సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, వోల్వో గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాస్ అవుట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మెడల్స్‌ను, పట్టాలు అందజేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్యను అందించడానికి సిద్ధార్థ గ్రూప్ కళాశాలలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ స్థాయి ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఇంకుబేషన్ సెంటర్లను అభివృద్ధి చేశామని అన్నారు. విద్యా ప్రమాణాలు, నాణ్యతలో రాజీ పడకుండా విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు మాట్లాడుతూ తోటి వారితో పోటీ పడి సృజనాత్మక, ఇన్నోవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. యువ ఇంజినీర్లు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 2024–25లో విద్యా సంవత్సరానికి సంబంధించి 17 మంది విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నామినీస్ ప్రశాంతి, అరుణక్రాంతి, ప్రిన్సిపాల్ మధు, జనార్దనరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ విజయభాస్కర్, గోపి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

23న యువత పోరు

- వాల్‌పోస్టర్ విడుదల చేసిన విజయానందరెడ్డి
- అమూల్ డెయిరీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ



యువతపోరు వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న విజయానందరెడ్డి, పక్కన మనోజ్‌రెడ్డి, స్లాండ్లీ

చిత్తూరు కార్పొరేషన్: విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరుతూ సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'యువతపోరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో యువతపోరు వాల్‌పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు చిత్తూరులోని అమూల్ డెయిరీ వద్ద విద్యార్థులు, యువతతో కలిసి ర్యాలీగా బయలుదేరుతామన్నారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేసి, సమస్యల పై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు.

అస్తవ్యస్తంగా చదువులు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఇంతవరకు సంక్షేమ పథకాలు అమలు చేయలేదని మండిపడ్డారు. విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని వాపోయారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతిదీవెన పథకాల ఊసేలేవన్నారు. పేద కుటుంబాల్లో పిల్లలు చదవులు అగమ్యగోచరంగా మారినట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపక్క విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నా ఫీజులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు.

గత ప్రభుత్వంలో విద్యకు పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.18,663 కోట్లతో 27 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా ఉన్నత విద్యను అందించిందన్నారు. పెండింగ్‌లోని ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ నిర్వహణ ఖర్చుల కింద రూ.7,800 కోట్లు చెల్లించినట్టు గుర్తుచేశారు. కాగా కూటమి ప్రభుత్వం ఫీజుల కింద రూ.700 కోట్లు ఇచ్చామని చెబుతున్నా ఇంతవరకు పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. ఈ విద్యా సంవత్సరం రూ.3,900 కోట్లు అవసరం కాగా బడ్జెట్‌లో రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు.

జాబ్‌క్యాలెండర్ ఎక్కడ?

చిత్తూరు నియోజకవర్గ యువత అధ్యక్షుడు మనోజ్ రెడ్డి మాట్లాడుతూ మీకు రూ.15వేలు... అంటూ ఊకదంపుడు ప్రచారం చేసిన నాయకులు ఇప్పుడు రూ.13వేలు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. అదే విధంగా జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి చేతులు పైకెత్తేశారని ఎద్దేవా చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా నిబంధనల పేరుతో అభ్యర్థులకు నష్టం కలిగించారన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 4 లక్షల మంది ఉద్యోగులను తొలగించారని తెలిపారు. భృతి ద్వారా అందాల్సిన వేలకోట్లు నిరుద్యోగులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ.శ్రీధర్, చిత్తూరు రూరల్ యువత అధ్యక్షుడు స్లాండ్లీ, జిల్లా విద్యార్థి జేఏసీ చైర్మన్ సద్దాం, నాయకులు రెడ్డిసాయి, శబరీష్, హితీష్, ప్రవీన్, తరుణ్, సచిన్ పాల్గొన్నారు.